క్లుప్తంగా

ఎస్సీ వర్గీకరణ సరికాదు

మదనాపురం: మండలంలోని కొన్నూరులో సోమవారం ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా కన్వీనర్ మొలకలపల్లి మద్దిలేటి ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా దాసరి కొండన్న, ప్రధాన కార్యదర్శిగా దాసరి భాస్కర్, కోశాధికారిగా దాసరి శ్రావణ్‌కుమార్ నియమించారు. ఈ సందర్భంగా మద్దిలేటి మాట్లాడుతూ డిసెంబర్ 1న జరిగే మాలల సింహ గర్జన సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

దంతనూరుకు బీటీ రోడ్డు వేయండి



మదనాపురం: మండలంలోని గోవిందహళ్లి గ్రామం నుంచి దంతనూరు వరకు ఉన్న మెటల్ రోడ్డును బీటీ రోడ్డుగా మార్చాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. కొత్తకోటకు వెళ్లాలంటే ప్రధాన రోడ్డు ఆత్మకూర్, వనపర్తి రహదారిపై వెళ్లాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. ఈ రోడ్డు పూర్తైతే కేవలం రెండు కిలోమీటర్ల దూరం ప్రయాణించి కొత్తకోటకు చేరుకుంటామన్నారు. వర్షాకాలంలో రోడ్డంతా బురదమయం కావడంతో పొలాలకు వెళ్లే రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బీటీ రోడ్డు వేయాలని కోరుతున్నారు.

ఆకుముడత నివారణకు చర్యలు తీసుకోవాలి

వీపనగండ్ల: మామిడి తోటలకు సోకే ఆకుమచ్చ తెగులు నివారణ కోసం మామిడి రైతులు సత్వర చర్యలు తీసుకోవాలని మండల ఉద్యానవన అధికారి కృష్ణ అన్నారు. ఆకుమచ్చ, ముడత తెగుళ్ల నివారణ కోసం ల్యాండాతో వెటబుల్ సల్ఫర్‌ను కలిపి పిచికారీ చేసుకోవాలని ఆయన మామిడి రైతులకు విజ్ఞప్తి చేశారు. అవసరమైన సలహాల, సూచనల కోసం ఉద్యానవన అధికారులను సంప్రదించాలని సూచించారు. ఫర్టిలైజర్ దుకాణాదారులు నమ్మి అనవసర మందులు పిచికారీ చేసి మామిడి రైతులు నష్టపోవద్దని ఆయన కోరారు.

శబరికి బయలుదేరిన దీక్షాపరులు



ఆత్మకూర్: పట్టణంలో వేదపండితుడు మదనాపురం గోపాలకృష్ణమూర్తి గురుస్వామి ఆధ్వర్యంలో సోమవారం అయ్యప్ప మాలధారులు ఇరుముడి మహోత్సవ పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం వాటర్‌ప్లాంట్ రఘుస్వామి ఆధ్వర్యంలో దీక్షాపరులు శబరికి బయలుదేరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ



ఆత్మకూర్: మండలంలోని మూలమళ్లకు చెందిన పవన్‌కుమార్‌కు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.90 చెక్కును శాసనసభ్యుడు డాక్టర్ వాకిటిశ్రీహరి ఆదేశాల మేరకు సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో బాధిత కుటుంబసభ్యులకు కాంగ్రెస్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రహ్మతుల్లా, పరమేష్, తులసీరాజ్, నల్గొండ శ్రీను, రాజశేఖర్ రెడ్డి, బీసన్న, మధు, నర్సింహ, ఈర్లదిన్నె శ్రీను, హరీష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తం



ఆత్మకూర్: సైబర్ నేరగాళ్లతో యువత, విద్యార్థులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ నరేందర్ సూచించారు. సోమవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో సైబర్ నేరాలపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటర్‌నెట్ వినియోగం పెరిగిన తర్వాత సైబర్ నేరాలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. అపరచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌కు ఓటీపీలు, బ్యాంకు వివరాలు చెప్పొద్దని సూచించారు. మెసేజ్‌ల రూపంలో వచ్చే అనవసర లింకులను క్లిక్ చేయరాదని, అలాంటి వాటి ద్వారా డబ్బులు పోగొట్టుకునే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠాపన పూజలు

ఆత్మకూర్: మండలంలోని బాలకిష్టాపూర్ గ్రామ శివారులో కోదండరామ స్వామివారి విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. బాలకిష్టాపూర్ శివారులోని శ్రీఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం ఉదయం గోపూజ, గణపతిపూజ, పుణ్యవహవాచనం, నందిపూజ, పంచగవ్యప్రాషణ, యాగశాల ప్రవేశవ, ద్వారపూజ, షోడాశస్తంభపూజ, సర్వతోభద్రమండల, యంత్రారాధన, ప్రధానకలశ స్థాపన, యంత్రాభిశేఖం, హారతి, తీర్థప్రసాద వినియోగం, సాయంత్రం వాల్మీకి పూజ, మృత్సంగ్రహణం, అంకురారోపణ, మూలమంత్ర జపములు, దీక్షాహోమం, జలాధివాసం, మహామంగళహారతి, వేదస్వస్తి, తీర్థప్రసాద వినియోగం తదితర పూజ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 19 ఉదయం నుంచి రాత్రి దాక ప్రత్యేక పూజలు ఉంటాయని, 20వ తేదీన ఉదయం 10గంటలకు సీతా రాములవారు, లక్ష్మణ, ఆంజనేయస్వామిల విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం ఉంటుందని, భక్తులు వేలాదిగా తరలిరావాలని నిర్వాహకులు కోరారు. పూజకార్యక్రమాల్లో గాడి లక్ష్మీనారాయణ అరుణ దంపతులు, మాజీసర్పంచ్ తుకారాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ప్రతిష్టపూజల్లో పాల్గొన్న గాడి లక్ష్మీనారాయణ దంపతులు

సమగ్ర కుటుంబ సర్వేకు సహకరించండి

అమరచింత: సమగ్ర కుటుంబ సర్వే కోసం వస్తున్న ఎన్యుమరేటర్లు అడిగిన సమాచారం అందించి సర్వేకు ప్రజలు సహకరించాలని ఎంపీఓ నరసింహులు కోరారు. మండలంలోని నాగల్‌కడ్మూర్‌లోని వివిధ బ్లాక్‌ల్లో ఎన్యుమరేటర్లు ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేసుకుంటున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సర్వే వల్ల కుటుంబానికి ప్రభుత్వ పరంగా ఎలాంటి సహకారం అందించాలో అన్న విషయాలతో పాటు వారి ఆర్థిక పరిస్థితులు ఎలా ఉన్నాయనే విషయాలు తెలుసుకునేందుకు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే మండలంలో ముమ్మరంగా కొనసాగుతుంది. సర్వేలో భాగంగా సోమవారం మండలంలోని వివిధ గ్రామాల్లో ఎన్యుమరేటర్లు ఇంటింటికి తిరుగుతూ 28 జీపీల్లో 914 ఇళ్ల నుంచి వివరాలను సేకరించినట్లు అధికారులు పేర్కొన్నారు. సర్వేలో ఇంటి యజమానులు ఇచ్చే వివరాలను తప్పులు లేకుండా నమోదు చేసుకోవాలని అధికారులు ఎన్యుమరేటర్లకు సూచించారు.



నాగల్‌కడ్మూర్‌లో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

ఇంటింటి సర్వేపై కళాజాతా..

ఖిల్లాఘనపురం: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సమగ్ర కుల, సామాజిక ఇంటింటి సర్వేపై తెలంగాణ సాంస్కృతిక సారధి కళాబృందం వారు ప్రజలకు అవగాహన కల్పించారు. మండల కేంద్రంలోని బస్టాండు వద్ద కళాజాత బృందం అధ్యక్షుడు గుడిసె శివలింగం ఆధ్వర్యంలో సర్వే సమయంలో అధికారులకు చెప్పాల్సిన అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో కళాకారులు శ్రీనివాసులు, నరసింహ, కృష్ణయ్య, బోనాసి రాజు, సువర్ణ, రాధ, ఎం.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థలో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి



భూసాని వెంకటేశ్వరరావుకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

ఖిల్లాఘనపురం: వెనకబడిన తరగతులు, జాతుల వారికి స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించి రాజకీయంగా ఎదిగేందుకు అవకాశం కల్పించాలని రజక సంఘం జిల్లా అధ్యక్షుడు విజయ్‌దేవరకొండ, జిల్లా వడ్డెర సంఘం, సంచార జాతుల సంఘం అధ్యక్షుడు దాసర్ల భూమయ్య అన్నారు. సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థానిక సంస్థల్లో వెనకబడిన తరగతులకు రిజర్వేషన్ల గుర్తింపు అంశంపై నిర్వహించిన డెడికేటెడ్ కమీషన్ నిర్వహించిన బహిరంగ విచారణకు వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు బీసీలకు, సంచార జాతుల వారికి అందాల్సిన రిజర్వేషన్ల గురించి చైర్మన్ భూసాని వెంకటేశ్వరరావును కలిసి వేరు వేరుగా వినతిపత్రాలు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీలకు రిజర్వేషన్ల విషయంలో తీవ్ర అన్యాయం జరుగుతుందని వాపోయారు. ఇప్పటికైనా బీసీ లకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించి న్యాయం చేయాలని కోరారు.

'కుల గణన సర్వేలో సగరులకు న్యాయం చేయాలి'

పాన్‌గల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుల సర్వే ఫార్మెట్‌లో సగర (ఉప్పరి) కులాన్ని వృత్తి కులంగా చేర్చకపోవడంపై అభ్యంతరం తెలుపుతూ తెలంగాణ వెనుకబడిన తరగతుల డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వరరావుకు జిల్లా సగర సంఘం ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సగర సంఘం జిల్లా అధ్యక్షుడు మోడాల తిరుపతయ్యసాగర్, ప్రధాన కార్యదర్శి పల్లె సత్యనారాయణ, కోశాధికారి కురుమూర్తి మాట్లాడుతూ.. సగరులు బీసీ డీ లో కొనసాగితూ ఎలాంటి విద్యా, ఉపాధి అవకాశాలు లేకుండా దుర్భర జీవితం గడుపుతున్నారని వాపోయారు. దశాబ్దాలుగా నిర్మాణ రంగంపై అధారపడి 90 శాతం మంది సగరులు జీవిస్తున్నారన్నారు. సగరులను ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క పేరుతో సగర, ఉప్పర, బేల్దార్, సుతారి లాంటి పేర్లతో పిలుస్తారన్నారు. వృత్తి కులంగా గుర్తించకపోవడంతో తమ సంఖ్య తక్కువగా వచ్చే ప్రమాదం ఉందని, ఈ విషయాన్ని సరిచేసే విధంగా చూడాలని వినతిపత్రంలో కోరినట్లు వారు పేర్కొన్నారు. దీనికి చైర్మన్ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



కిష్టాపూర్‌తండాలో కిశోర్‌నాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీరం హర్షవర్ధన్‌రెడ్డి

వనపర్తి రూరల్: సీపీఎం పట్టణ కార్యదర్శి పరమేశ్వరాచారి ఆధ్వర్యంలో సోమవారం అంబేద్కర్ చౌరస్తాలో వనగంటి ఈశ్వర్ 4వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన స్థూపానికి, చిత్రపటానికి పలువురు నాయకులు పుట్టా ఆంజనేయులు, జబ్బార్, వనగంటి నాగేశ్వర్‌తో పాటు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి చివరి వరకు కమ్యూనిస్టు నాయకులుగా పనిచేశారని, దాదాపు 25 ఏళ్లు ఉమ్మడి మమబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శిగా పని చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బాల్‌రెడ్డి, మండ్ల రాజు, బాలస్వామి, గంధం మదన్, గంధం గట్టయ్య, బీసన్న, ఆంజనేయులు, ఉమ, సాయిలీల, రాబర్ట్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

పాన్‌గల్: మండలంలోని కిష్టాపూర్‌తండాకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు పిర్యానాయక్ కుమారుడు కిశోర్‌నాయక్ రోడ్డు ప్రమాదంలో రెండు రోజుల క్రితం మరణించాడు. విష యం తెలుసుకున్న కొల్లాపూర్ మాజీ ఎమ్మె ల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు దురెడ్డి రాఘువర్ధన్‌రెడ్డి సోమవా రం తండాకు చేరుకొని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పార్టీపరంగా బాధిత కుటుంబానికి అండగా ఉంటామని, మృతుడికి పార్టీ సభ్యత్వం ఉంటే పార్టీ పరంగా సాయం అందుతుందన్నారు. బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు.

ప్రశాంతంగా ముగిసిన గ్రూప్-3 పరీక్షలు

కొత్తకోట రూరల్: జిల్లాలో గ్రూప్-3 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఒక్క నిమిషం ఆలస్యమైనా అధికారులు అభ్యర్థులను పరీక్షకు అనుమతించలేదు. కొత్తకోట పట్టణ కేంద్రంలోని నివేదిత డిగ్రీ కళాశాల, నివేదిత జూనియర్ కళాశాల, బెస్ట్ గ్రామర్ స్కూల్, ప్రతిభ జూనియర్ కళాశాల, భారతీయ విద్యామందిర్, ఉషోదయ స్కూల్ కేంద్రాలను ఏర్పాటు చేయగా ఒక్కో పరీక్ష కేంద్రంలో 360మంది అభ్యర్థులను కేటాయించారు.

గోపాల్‌పేట: మండలంలోని నర్సింగాయపల్లి సమీపంలో గల గాయత్రి బీఈడీ కాలేజీలో గ్రూప్-3 పరీక్ష రెండో రోజు ప్రశాంతంగా ముగిసింది. సోమవారం ఉదయం పది గంటల నుంచి ప్రారంభయిన పరీక్ష పన్నెండున్నరకు ముగిసింది. పరీక్షకు మొత్తం 264 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 111 మంది హాజరయ్యారు. 153 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. ఎస్పీ రావుల గిరిధర్ పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూసుకోవాలని ఎస్ఐ నరేష్‌కు సూచించారు.



పరీక్ష సమయం సమీపిస్తుండడంతో కొత్తకోటలో పరుగెత్తుకుంటూ వస్తున్న అభ్యర్థి

సర్టిఫికెట్ల అదృశ్యంపై ఫిర్యాదు

గోపాల్‌పేట: మండల కేంద్రానికి చెందిన హుస్సేన్‌బాషా, హబీబ్‌ఉన్నిసా దంపతుల కుమార్తె సమ్రీన్‌బేగం ఇంటర్ పూర్తి చేసింది. బీఎస్సీ నర్సింగ్ చేసేందుకు ఇటీవల ఎంసెట్ రాయగా సెకండ్ ఫేజ్‌లో వనపర్తిలోని ఇండియన్ నర్సింగ్ కాలేజీలో సీటు కేటాయించారు. కళాశాలలో చేరేందుకు రావాలని కాలేజీ నుంచి ఆదివారం తల్లిదండ్రులకు ఫోన్ చేయగా.. తల్లిదండ్రులు, విద్యార్థి వారి ఇంట్లో సర్టిఫికెట్ల కోసం ఎంత వెతికినా కనిపించలేదు. సర్టిఫికెట్లు పోయాయని గుర్తించిన తల్లిదండ్రులు అయోమయంలో పడిపోయారు. ఎంసెట్ అప్లై చేసేందుకు ఇతర పనుల కోసం వనపర్తికి, మహబూబ్‌నగర్‌కు తిరిగామని.. ఈ క్రమంలో ఎక్కడో పడిపోయి ఉంటాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈనెల 25లోపు కాలేజీలో సర్టిఫికెట్లు సమర్పించకపోతే సీటు పోతుందని ఎవరికైనా దొరికితే సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరారు. సర్టిఫికెట్ల కవరులో పదోతరగతి, ఇంటర్ మెమోలు, బోనఫైడ్లు, ఎంసెట్ ర్యాంకు కార్డు, బ్యాంకు పాస్‌బుక్, పాన్‌కార్డు, ఆరు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు ఉన్నాయని విద్యార్థిని తల్లిదండ్రులు తెలిపారు. ఈ విషయంపై సోమవారం గోపాల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని చెప్పారు. ఎవరికైనా దొరికితే 94930 80966 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరుతున్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత




ఆత్మకూర్: మండలంలోని కత్తేపల్లి గ్రామానికి చెందిన బైని శంకర్ ఆగస్టు 15న కొత్తకోటకు ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తుండగా.. సెల్‌ఫోన్ పడిపోయింది. దీనిపై బాధితుడి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. ఈ మేరకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్ ఆచూకీని గుర్తించి హైదరాబాద్‌లో రికవరీ చేసి బాధితుడికి అప్పగించినట్లు తెలిపారు.

బాధితులకు పరామర్శ



మదనాపురం: మండలంలోని దుప్పల్లికి చెందిన కురుమూర్తి లిప్పు మాజీ ప్రెసిడెంట్ గొల్ల లక్ష్మన్న ప్రమాదవశాత్తు గాయపడి మహబూబ్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి సోమవారం రాత్రి బాధితుడిని పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు. ట్రాక్టర్ ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న కురుమూర్తిని, అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న నెలివిడికి చెందిన బడుగుల రాములును పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. బాధితులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

విద్యార్థులకు బ్యాగ్‌ల పంపిణీ



గట్టు: మండలంలోని గొర్లఖాన్‌దొడ్డి ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు సోమవారం సినీ హీరో రాంచరణ్ అభిమాని స్కూల్ బ్యాగ్‌లను అందజేశారు. క్లిన్‌కార కొణిదెల హెల్పింగ్ హాండ్స్ సభ్యురాలు సంధ్యాజయరాజ్ వందమంది విద్యార్థులకు స్కూల్‌బ్యాగ్‌లను అందజేశారు. హ్యాపీ లివింగ్స్ గ్రూప్స్ అధినేత శ్రీనుబాబు కూడా స్కూల్‌బ్యాగ్‌ల కోసం సాయం అందించినట్లు జయరాజ్ తెలిపారు.

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కాంటా



పాన్‌గల్ కొనుగోలు కేంద్రంలో ధాన్యం కాంటా చేస్తున్న హమాలీలు

సాక్షి ఎఫెక్ట్..

పాన్‌గల్: 'కొనుగోలు కేంద్రాల్లో పడిగాపులు' అనే శీర్షికన సాక్షి దినపత్రికలో సోమవారం ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించి పాన్‌గల్, దొండాయిపల్లి, శాగాపూర్ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ ప్రారంభించారు. ఆయా కేంద్రాల్లో ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం సేకరణ ప్రారంభించడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యలను అధికారుల దృష్టికి వెళ్లే విధంగా వార్తను ప్రచురించి, సమస్య పరిష్కారానికి కృషి చేసిన సాక్షి దినపత్రికకు కృతజ్ఞతలు తెలిపారు. కేంద్రాలకు తీసుకొచ్చే ధాన్యంలో తాలు, దుమ్ము లేకుండా చూసుకోవడంతో పాటు తేమ శాతం ప్రభుత్వం సూచించిన విధంగా ఉంటే సేకరణలో జాప్యం ఉండదని సీఈఓ భాస్కర్‌గౌడ్ రైతులకు సూచించారు.

తేమశాతం లెక్కింపుపై అవగాహన

పాన్‌గల్: మండల కేంద్రంతో పాటు కొత్తపేట గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను మండల వ్యవసాయ అధికారి రాజవర్ధన్‌రెడ్డి సోమవారం సందర్శించి ధాన్యంలో తేమశాతం, నాణ్యత లెక్కింపు విధానంపై కేంద్రాల ఇన్‌చార్జ్‌లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ కేంద్రాలకు వచ్చిన ధాన్యం తేమశాతం, నాణ్యతలను సక్రమంగా లెక్కించకపోతే రైతులకు ఇబ్బందులు కలుగుతాయన్నారు. దీంతో ఆయా నిబంధనలపై అవగాహన కలిగి ఉంటే రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరణ వేగవంతం చేసేందుకే కేంద్రాల ఇన్‌చార్జ్‌కు అవగాహన కల్పిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా ధాన్యం సేకరణ చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఈఓ అఖిల, రైతులు పాల్గొన్నారు.



పాన్‌గల్‌లో తేమ శాతం లెక్కించే విధానాన్ని పరిశీలిస్తున్న ఏఓ రాజవర్ధన్‌రెడ్డి

బకాయి వేతనాలు చెల్లించాలి



వనపర్తి మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

వనపర్తి రూరల్: బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) ఆధ్వర్యంలో సోమవారం కార్మికులు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులతో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు మాట్లాడుతూ మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం వల్ల 5వ తేదీ లోపు ఇవ్వాల్సిన వేతనాలు ఇంతవరకు అందలేదన్నారు. ప్రతి నెల ఆలస్యంగా వేతనాలు ఇస్తున్నారన్నారు. మున్సిపల్ కమిషనర్ 1వ తేదీన వేతనం తీసుకుంటూ కార్మికులకు మాత్రం ప్రతి నెల 25వ తేదీ అయినా వేతనం ఇవ్వడం లేదని విమర్శించారు. కమిషనర్, చైర్మన్‌తో ఫోనులో మాట్లాడగా.. ఈ నెల 20వరకు వేతనాలు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గడ్డం కురుమయ్య, బాలు, లాలు, గోపాల్, యాదగిరి, కురుమూర్తి, వెంకటమ్మ, రాణి, జయమ్మ పాల్గొన్నారు.

పంచాయతీ వర్కర్ల ఆధ్వర్యంలో..

అమరచింత: గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే మంజూరు చేయాలంటూ సోమవారం అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందించామని టీయూసీఐ జిల్లా కోశాధికారి రాజు తెలిపారు. జిల్లాలోని వివిధ మండల కేంద్రాలతో పాటు గ్రామాల్లో పనిచేస్తున్న గ్రామ పంచాయతీ వర్కర్లు ప్రభుత్వం తల పెట్టిన ప్రతి కార్యక్రమాలను గ్రామాల్లో ముందు వరుసలో ఉండి విజయవంతం చేస్తున్నా.. ప్రభుత్వం వారిపై చిన్నచూపు చూస్తుందని ధ్వజమెత్తారు. ప్రతి పంచాయతీ కార్మికులకు నాలుగు నెలల నుంచి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని వాపోయారు. దీనిపై పలుమార్లు పంచాయతీ కార్యదర్శులకు, ఎంపీడీఓలకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేదన్నారు. కార్యక్రమంలో గణేష్, గోవిందమ్మ, పెంటయ్య, గంగమ్మ, కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

తూతూమంత్రంగా రహదారి మరమ్మతు

అమరచింత: మండలంలోని కొంకన్‌వానిపల్లి నుంచి అమరచింత పట్టణం వరకు ఉన్న ఏడు కిలోమీటర్ల బీటీ రహదారిపై ఏర్పడ్డ గుంతలను పూడ్చడానికి మరమ్మతు పనులు చేపడుతున్నారు. ప్యాచ్ వర్క్ గాను రూ.9 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఏడు కిలోమీటర్ల మేరకు అక్కడక్కడ గుర్తించిన గుంతలను పూడ్చడానికి కంకర వేయడంతో పాటు డస్ట్ వేసి రోలర్‌తో తిప్పకుండానే తూతూమంత్రంగా కంకరతో పూడ్చివేస్తున్నారు. దీంతో నెల రోజుల వ్యవధిలోనే మరోమారు గుంతలు ఏర్పడటం ఖాయమని కొంకన్‌వానిపల్లి, పాంరెడ్డిపల్లి, అమరచింత గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారుల అలసత్వంతో సదరు కాంట్రాక్టర్లు తూతూ మంత్రంగా మరమ్మతులు చేపడుతున్నారని ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి రహదారి ప్యాచ్ వర్క్‌లను నాణ్యతగా చేపట్టాలని కోరుతున్నారు.



పాంరెడ్డిపల్లి శివారులో రహదారిపై గుంతలను పూడ్చుతున్న కార్మికులు

పైప్‌లైన్ లీకేజీతో ఇబ్బందులు

అమరచింత: పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో ప్రధాన బీటీ రహదారిపై తాగునీటి పైప్‌లైన్ లీకేజీతో రహదారి గుంతలమయంగా తయారవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. మున్సిపల్ అధికారులు జీఎస్ స్థూపం వద్ద ఉన్న తాగునీటి బోరు ద్వారా పైప్‌లైన్ వేసి బీసీ కాలనీతో పాటు బస్టాండ్ రహదారిపై ఉన్న ఇళ్లకు తాగునీటి కోసం ప్రధాన బీటీ రహదారిని తవ్వి పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం పైప్‌లైన్ లీకేజీ కారణంగా రహదారి దెబ్బతిని గుంతలమయంగా తయారవుతూ.. లీకేజీ నీరు రహదారిపై పారుతుండటంతో పరిసరాలు మురుగుగా తయారయ్యాయి. అధికారులు స్పందించి పైప్‌లైన్ లీకేజీని మరమ్మతులు చేపట్టి రహదారి దెబ్బతిన కుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



పైప్‌లైన్ లీకేజీ వల్ల ఏర్పడ్డ గుంత

అభివృద్ధి పనులు చేపట్టండి

అయిజ: మున్సిపాలిటీలో అనేక సమస్యలు తిష్టవేశాయని, సమస్యలన్నింటినీ పరిష్కరించాలని బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి భగత్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. పట్టణంలో పెరిగిన జనాభాను దృష్టిలో పెట్టుకొని వార్డుల సంఖ్య పెంచాల్సిన అవసరం ఉందన్నారు. మున్సిపాలిటీలో రెగ్యూలర్ కమిషనర్ లేకపోవడంతో సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణంలో కోనోకార్పస్ చెట్లను తొలగించకపోవడం వలన ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని వాపోయారు. సమస్యలను పరిష్కరించకుంటే బీజేపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడుతారని హెచ్చరించారు.



మాట్లాడుతున్న భగత్‌రెడ్డి